విశాలాంధ్ర

ముమ్మిడివరం రోడ్డుకు మోక్షమెప్పుడో?

విశాలాంధ్ర - కాట్రేనికోన : ఎమ్మెల్యే లేదా ఎంపీ కాదు సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన కాట్రేనికోన వయా అయినాపురం మీదుగా ముమ్మిడివరం ఆర్ అండ్ బి రోడ్డు ఆధునీకరణ పనులు శంకుస్థాపన చేసి రెండేళ్లు కావస్తున్నా అడుగు ముందుకు సాగడం లేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన రోడ్డు దుస్థితి ఉండడంతో నియోజకవర్గ ప్రజలు ఆవేదన చెందుతున్నారు. కాట్రేనికోన, ముమ్మిడి వరం, అయినవిల్లి, ఐ పోలవరం మండలాలను కలిపే ఈ లింకుప్రధాన రహదారి ముమ్మిడివరం నియోజకవర్గం ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల వారికి ఎంతగానో ఉపయోగపడు తుంది. కొన్నేళ్లుగా ఈ రహదారి పాలకులు, అధికారులు నిర్లక్ష్యానికి గురై అధ్వానంగా తయారయ్యింది. కాట్రేనికోన నుండి ముమ్మిడివరం వరకు దాదాపు పది కిలోమీటర్లు రోడ్డు పూర్తిగా పాడై గుంటలతో దర్శనమిస్తోంది. ఈ రోడ్డు మీదుగా ప్రయాణించాలంటే నరకమే. ప్రస్తుత వరద ల్లోనూ మిగిలిన రోడ్డంతా కొట్టుకుపోయి అధ్వానంగా మారి ప్రమాదాలకు నిలయంగా మారింది. కాట్రేనికోన నుండి ముమ్మిడివరం వెళ్లడానికి దగ్గర దారిగా ఉన్న ఈ రోడ్డును వదిలేసి ప్రజలు దూరమైనా చేయ్యేరు గ్రామం మీదుగా ప్రయాణిస్తూ అష్ట కష్టాలు పడు తున్నారు. ఇక్కడ ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యమూ లేకపోలేదు. 2021లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని 14 రోడ్ల ప్యాకేజీలో భాగంగా ఒక పనిగా కాట్రేనికోన-ముమ్మిడివరం ఆర్ అండ్ బి రోడ్డును కాకినాడకు చెందిన సుధాకర్ ఇన్ఫాటెక్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కాంట్రాక్టు అప్పగించారు. అప్పటి నుంచి నేటి వరకు కాంట్రాక్టర్ రోడ్డుపై తట్ట మట్టి వేసిన పాపాన పోలేదు. ఆర్ అండ్ బి అధికారులు ఎన్ని నోటీసులు ఇచ్చిన కాంట్రాక్టర్ స్పందించకపోవడంతో వారు చేసేది ఏమీ లేక చేతులు ఎత్తేసారనే చెప్పాలి. ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ పట్టు వదలని విక్రమార్కునిలా రోడ్డు విషయమే తరచూ విజయవాడ వెళ్లి ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్ పై ఒత్తిడి తెచ్చినా అడుగు ముందుకు సాగటం లేదు. తాజాగా ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో మరో 18 నెలలు కాంట్రాక్టు గడువును 2024 సెప్టెంబర్ 17వ తేదీ వరకు పొడిగిస్తూ కాకినాడ ఆర్ అండ్ బి సూపరింటెండెంట్ ఇంజనీరు కె హరిప్రసాద్ బాబు ఉత్తర్వులు జారీ చేశారు కూడా. కోట్లాది రూపాయలతో రోడ్డు పనులు పూర్తి చేసినా ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించరనే భయంతోనే కాంట్రాక్టర్ ముందుకు రానట్టు తెలుస్తోంది. దీనికి తోడు కొన్ని నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతుండడంతో ఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందో తెలియని అయోమయ పరిస్థితి రోడ్డు అభివృద్ధికి అడ్డంకిగా మారింది. ఇప్పటికే రోడ్డు వెంబడి గ్రామాల్లోని సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, నాయకులు స్వచ్ఛందంగా సొంత సొమ్ములు వేసుకొని ప్రజల బాధ భరించలేక తాత్కాలికంగా రోడ్డుపై గోతులు పూడ్చుకున్నా రంటే ప్రభుత్వం నిర్లక్ష్యం వెల్లడి అవుతోంది. ఇప్పటికైనా కాట్రేనికోన-ముమ్మిడివరం రోడ్డు పనులు యుద్ధ ప్రాతిపదికపై పూర్తి చేయాలని నియోజకవర్గ ప్రజలు ముక్త కంఠంతో కోరుతున్నారు. ఇక ఎన్నికల నాటికైనా రోడ్డు పనులు పూర్తి చేస్తారో లేదో అధికార నాయక గణానికే తెలియాలి.

పోస్టాఫీసులో జాతీయ జెండాలు

విశాలాంధ్ర - కొత్తపేట : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు దేశం ముస్తాబవు తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ద్వారా పోస్టాఫీసులో జాతీయ జెండా రూ.25లకే అందించేందుకు శ్రీకారం చుట్టింది. కేంద్ర ప్రభుత్వం తపాల శాఖ ద్వారా కేవలం 25 రూపాయలకే జాతీయ జెండాల పంపిణీ కార్యక్రమం ప్రారంభించింది. కొత్తపేట సబ్ డివిజనల్ పోస్టల్ ఇన్స్పెక్టర్ వి సత్యరాజు, పోస్ట్ మాస్టర్ ఆర్ఎస్‌బి చార్యులు, మెయిల్ ఓవర్సీర్ అర్జున్‌లు ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి జాతీయ జెండా విక్రయించి వివిధ రకాల పోస్టల్ స్కీములు వివరించారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాగు నీరు కోసం రైతుల నిరసన

విశాలాంధ్ర - పి గన్నవరం : పి గన్నవరం మండలంలోని గాజులగుంట, ముంగండపాలెం ప్రాంతాలకు చెందిన రైతులు పి గన్నవరంలోని ఇరిగేషన్ శాఖ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పంటలకు సాగునీటిని అందించే కాలువలపై కొందరు అక్రమ నిర్మాణాలు చేపట్టడం వలన వాటికి వ్యర్థాలు అడ్డుపడి సాగునీరు శివారు భూములకు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు మట్టపర్తి వెంకటేశ్వరరావు, మట్టపర్తి సూర్యనారాయణ, పెరుమాళ్ళ పెద్ద కాపు, జక్కం శెట్టి రామారావు, మట్టపర్తి నాగేశ్వరరావు, మట్టపర్తి శ్రీనివాసరావు, మట్టపర్తి సత్యనారాయణ, ఈతకోట వెంకటరావు, వడలి వెంకన్న, గుత్తుల ప్రకాష్ రావు, ముత్తబత్తుల సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

టేకిలో డాక్టర్ వైయస్సార్ పొలంబడి

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం టేకి గ్రామంలో పొలంబడి కార్యక్రమం జరిగింది. దానిలో భాగంగా టేకిలో శుక్రవారం డాక్టర్ వైయస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా రైతులకు పొలంబడిలో గ్రూప్ సభ్యులతో రైతులను పొలంలో దింపి డైగ్నోస్టిక్ పద్ధతిలో ఒక మూలన దిగి పది వరి దుబ్బులు పరిశీలించి మిత్రపురు గులు, శత్రు పురుగులను గమనించి దానిని ఒకచార్ట్ మీద వివరించారు. వ్యవసాయ భాగస్వామ్య కార్యాచరణ పరిశోధన రైతులతో చేయించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కెవిఎన్ రమేష్ కుమార్, మండలంలోని గ్రామ వ్యవసాయ సహాయకుడు హరిబాబు, రఘు, ప్రియాంక, పొలంబడి గ్రూప్ లీడర్స్ కొత్తపల్లి కృపారావు, దామిన బుల్లిరాజు, కామిరెడ్డి రాముడు, కొండిపర్తి పట్టాభి రామయ్య, దాసర వీరేంద్ర చౌదరి, చేకూరి విష్ణు మూర్తి, రైతులు పాల్గొన్నారు.

జగ్గిరెడ్డిపై మంత్రి విశ్వరూప్ ఫైర్

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురంలో శెట్టిబలిజ నాయకుడు వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యంను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని హెలిప్యాడ్ వద్ద కలిసే ఏర్పాటు చేసారు. కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ముఖ్య మంత్రిని కలిసే సందర్భంలో ఒక్కసారిగా మంత్రి విశ్వరూప్ జగ్గిరెడ్డి పై ఆగ్రహం వ్యక్తం చేసారు. తన నియోజకవర్గంలో తనకు తెలియకుండా ఈ ఏర్పాటు కుదరదు అంటూ కోపోద్రిక్తులయ్యారు. ఈ దశలో జగన్ మోహన్ రెడ్డి జోక్యం చేసుకుని సత్యం అన్నా నీగురించి తెలుసు. మాట్లాడుదాం అంటూ భుజం తట్టి ముందుకు సాగారు. వైసీపీకి చెందిన ముఖ్య నాయకుడు ఈ ఏర్పాటుకు తెరవెనుక సూత్రధారిగా వాసం శెట్టి సత్యం ముఖ్యమంత్రిని కలిసే ఏర్పాటు చేసినట్లు చర్చ జరుగుతోంది.

అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టుకు దరఖాస్తు ఆహ్వానం

విశాలాంధ్ర - జగ్గంపేట : కిర్లంపూడి మండలంలో ఖాళీగా ఉన్న అంగన్వాడి సహాయకురాలు పోస్టుకు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ జగ్గంపేట సిడిపిఓ పూర్ణిమ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ కిర్లంపూడి మండలం జగపతినగరం 9 అంగన్వాడి సెంటర్లో బీసీ ఏ రిజర్వేషన్ సంబంధించి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న మహిళలు వయస్సు 21 నుండి 35 సంవత్సరాలు లోపు ఉండాలన్నారు. అలాగే మహిళ స్థానికురాలు అయ్యుండా లన్నారు. ఈ దరఖాస్తులను ఈనెల 11 నుండి 19వ తేదీ లోపు జగ్గంపేట ఐసిడిఎస్ కార్యాలయంలో అందజేయాలని సిడిపిఓ పూర్ణిమ కోరారు.

ఓటర్ వెరిఫికేషన్ సక్రమంగా నిర్వహించాలి

విశాలాంధ్ర - జగ్గంపేట : ఎన్నికలు సక్రమంగా జరగాలంటే ఓటర్ వెరిఫికేషన్ పూర్తిస్థాయిలో జరగాలని, రిటర్నింగ్ అధికారి సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ డిమాండ్ చేశారు. జగ్గంపేట పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలకు అనుగుణంగా వెరిఫికేషన్ చేయాలన్నారు. అప్పుడే న్యాయబద్ధంగా ఓటర్ జాబితా తయారవుతుందన్నారు. జిల్లా రిటర్నింగ్ అధికారి బాధ్యత తీసుకుని ఓటర్ జాబితా పూర్తిగా విచారణ జరిగేలా చూడాలన్నారు. పూర్తిస్థాయిలో విచారణ జరిగేలా సెంట్రల్ ఎన్నికల కమి షన్ కూడా చూడాలన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు విచారణకు సమయం ఇవ్వాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, తదితరులు ఉన్నారు.

వ్యవసాయ సలహా మండలి సమావేశం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం ఏఏబి చైర్మన్ కనుమూరి వెంకట నరసింహారాజు అధ్యక్షతన ఆత్రేయ పురంలో నిర్వహించారు. కాలువ గట్లును పటిష్టపరచడానికి గట్లపై కొబ్బరి చెట్లు మినహా ఇతర పంటలను వేయకుండా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశించారు. ఏడిఏ కొత్తపేట ఎంవి రామారావు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ఈ పంట నమోదు ప్రారంభమైందని, రైతులు అందరు ఆధార్, పట్టా పాసుబుక్, ఫోన్ నెంబర్ ను రైతు భరోసా కేంద్రంలో ఇచ్చి పంట నమోదు చేయించుకోవాలని చెప్పారు. . ఏఏబి చైర్మన్ కనుమూరి వెంకట నరసింహారాజు మాట్లాడుతూ మండలంలో అరటి రైతులకి 1.2 కోట్ల ఇన్సూరెన్స్ డబ్బులు పడ్డాయి అని, పెరవరం మరియు ఉచ్చిలి ఎత్తుపోతల పంపు సెట్లు బాగుచేసి రైతులకి నీటి ఇబ్బంది లేకుండా అందించాలని తెలిపారు. వ్యవసాయ అధికారి జెవి పట్టాభి రామయ్య మాట్లాడుతూ ఈ సీజన్‌లో ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు రాకుండా ముందుస్తు ప్రణాళిక ద్వారా చర్యలు చేపడతామని తెలిపారు. ఉద్యాన అధికారి డాక్టర్ జి. కోటేశ్వరరావు మాట్లాడుతూ గోదావరి వరదల వల్ల పంట నష్టం జరిగిన వాటికి నష్టపరిహారం రాస్తున్నాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఇ పి సత్యనారాయణ, వెటర్నరీ డాక్టర్ పివివి సుబ్బారావు, మండల వ్యవసాయ సలహా సభ్యులు మరియు గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

నా భూమి నా దేశంలో మొక్కలు నాటిన పంచాయతీలు

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: నా భూమి...నా దేశం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని గ్రామాలలో వివిధ ప్రాంతాలలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. తాడిపర్రులో సర్పంచ్ కె.నరేంద్రబాబు, ఎంపీటీసీ కట్టా వెంకటేశ్వరరావు, కార్యదర్శి పి.సత్యనారాయణ, చివటంలో కార్యదర్శి కే కృష్ణవేణి, విఆర్వో ఎ. రాజశేఖర్, దమ్మెన్నులో సర్పంచ్ గురజల్ల వీర వెంకట సత్యనారాయణ, ఇన్చార్జి కార్యదర్శి వై.బాలకృష్ణ, వెలగదుర్రు లో సర్పంచ్ సాగి పద్మావతి, ఎంపీటీసీ ధనిశెట్టి మల్లికార్జున భ్రమరాంబ, కేసావరంలో సర్పంచ్ నార్ని రామకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దుర్గా భవాని, ఆయా గ్రామ సచివాలయాల సిబ్బంది, మహిళా పోలీసులు, వైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల పరిశీలన

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట జగనన్న లే అవుట్‌లో జరుగుతున్న గృహ నిర్మాణ, మౌలిక సదుపాయాల కల్పన పనులను శుక్రవారం జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ, వివిధ శాఖల అధికారు లతో కలిసి పరిశీలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి త్వరలో స్థానిక ఈఎస్‌టి లే అవుట్‌లో జరిగే సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమానికి వస్తున్న నేపథ్యంలో ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, లే అవుట్‌లో జరుగుతున్న మౌలిక సదుపాయాల కల్పన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణ లబ్దిదారులకు అందిస్తున్న సహాయంతో తమ ఇంటి నిర్మాణాలను పూర్తిచేసుకోవాలని, నిర్మాణ దశలో ఏవైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని లబ్దిదారులకు సూచించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

విద్యార్థులకు చేయూత

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : విద్య యువత అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని విద్య ప్రతి యువతకు అందించడం లక్ష్యంగా మేమంతా కృషి చేస్తున్నామని రోటరీ క్లబ్ డిజిఎన్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. సర్వీస్ ప్రాజెక్ట్‌లో భాగంగా రోటరీ క్లబ్, కాకినాడ వారు గురువారం ఎస్ఎంఎస్ రోటరీ హాల్లో జరిగిన సమావేశంలో ఇద్దరు కాలేజీ విద్యార్థులకు ఫీజు నిమిత్తం 40 వేలు విరాళంగా కళ్యాణ్ చక్రవర్తి విద్యార్థులు బొల్లు శ్రీవల్లి, బొల్లు మోహన్‌లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ గోపు కాశీ విశ్వనాథ్, కార్యదర్శి అరిగెల బాబీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ జోలికి వేస్తే సహించేది లేదు

విశాలాంధ్ర - రాజోలు : ఏ ప్రభుత్వమైనా ఎస్సీ వర్గీకరణ జోలికి వస్తే సహించేది లేదని రాష్ట్ర మాలమహానాడు అధ్యక్షుడు జగడం సత్యనారాయణ అన్నారు. శుక్రవారం రాజోలు మండలం తాటిపాక సెంటర్లో జగడం సత్యనారాయణ ఆధ్వర్యంలో మాల మృత వీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత అంబేద్కర్, మాలమహానాడు వ్యవస్థాపకుడు పివి రావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగడం మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్వర్గీయ పివి రావు పిలుపు మేరకు ఐదు లక్షల మంది మాలలు హైదరాబాద్‌లో చలో అసెంబ్లీ ముట్టడికి వెళ్ళగా అక్కడ జరిగిన సంఘటనలో పాసంగి శేషయ్య,గోపతోటి నారాయణ అనే ఇద్దరు మాల సోదరులు బలైపోయారని అన్నారు. అప్పటి నుండి ప్రతి సంవత్సరం ఆగస్టు 11 మాల మృతవీరుల సంస్మరణ దినోత్స వం జరుపుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి కొల్లాబత్తుల సతీష్ బాబు, బొంతు మణి రాజు, పోతుముడి శేఖర్, కుసుమ తిరుమల కుమార్, ఇంజేటి వెంకటరత్నం, విప్పర్తి మహేష్, తాడి ధర్మారావు, ఉండ్రు జాన్ బాబు, గెద్దం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా రుణాలతో జీవనోపాధి మెరుగుపరుచుకోవాలి

- సెర్ప్ సీఈఓ ఇంతియాజ్

విశాలాంధ్ర - రాజానగరం : ప్రభుత్వం అందిస్తున్న డ్వాక్రా రుణాలతో సంఘం సభ్యులు జీవనోపాధి మెరుగుపరుచుకోవాలని సెర్ప్ సీఈఓ మహమ్మద్ ఇంతియాజ్ అన్నారు.మండల కేంద్రమైన రాజానగరం లోని వెలుగు కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల మహిళా సమాఖ్య సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళలకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. దీనిలో భాగంగా ఆయన మాట్లాడుతూ సంఘ సభ్యులు తీసుకున్న ఋణంతో జీవనోపాధి చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని కోరారు. సంఘాల బలోపేతం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్త్రీనిధి ఎండి నాంచారయ్య, పిడి డిఆర్డిఎ సుభాషిణి,సెర్ప్ బ్యాంక్ లింకేజి డిపిఎం కేశవ, ఐకేపి ఎపిఎం కె.హేమ నాగలక్ష్మి, స్త్రీ నిధి ఏజిఎం, జిల్లా డీపీఎంలు, జెడ్ఎస్ అధ్యక్షులు, సెక్రటరీ, కోశాధికారి, ఎంఎస్ అధ్యక్షులు, సెక్రటరీ, కోశాధికారి తదితరులు పాల్గొన్నారు.

మండపేట పెట్రోల్ బంకుల్లో ఆకస్మిక తనిఖీలు

విశాలాంధ్ర - మండపేట : మండపేట, రూరల్ పెట్రోల్ బంకుల్లో పెట్రోల్, డీజిల్ కల్తీ, ఇలా అనేక మోసాలు అధికంగా జరుగుతున్నాయని ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల నేపథ్యంలో సివిల్ సప్లయి అధికారి ఎమ్మెస్వో సుబ్బరాజు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఒకే రోజు 6 పెట్రోల్ బంకులను పరిశీలించి వినియోగదారుల సేవలకు సంబంధించిన సదుపాయాలు, పెట్రోల్, డీజిల్లో ఉండాల్సిన నాణ్యతా ప్రమాణాల శాతాన్ని చెక్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెస్వో సుబ్బరాజు మాట్లాడుతూ ఇక్కడి పెట్రోల్ బంకుల నిర్వహణ తీరుపై గత ఫిబ్రవరిలో విజయవాడ సివిల్ సప్లయి కమిషనర్ కార్యాలయానికి ఫిర్యాదులు వెళ్లాయన్నారు. ఫిర్యాదులపై స్పందించి చర్యలకు ఉపక్రమించాలని జిల్లా కలెక్టరుకు ఉత్తర్వులు రావడంతో కలెక్టరు ఆదేశాల మేరకు తాము లోకల్ బంకుల్లో తనిఖీలు నిర్వహించామన్నారు.

ప్రజా వ్యతిరేక బీజేపీకి ఇండియా కూటమి ప్రత్యామ్నాయం

విశాలాంధ్ర - రాజోలు : దేశంలో రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి కార్పొరేట్లకు ఈ దేశాన్ని తాకట్టు పెట్టిన బిజెపికి ఈ దేశాన్ని పరిపాలించే అర్హత లేదని శుక్రవారం రాజోలులో జరిగిన ఇండియా కూటమి సన్నాహక సమావేశంలో మాట్లాడిన వక్తలు అన్నారు. ఇటీవల దేశంలో దళితులు, క్రిస్టియన్లు, ముస్లింలపై దాడులు పెరిగిపోయాయని, మహిళలపై అత్యాచారాలు చేసి, హత్యలు చేస్తున్న దేశంగా తయారైందని అన్నారు. దేశవ్యాప్తంగా 27 రాజకీయ పార్టీలతో ఏర్పడిన భారత జాతీయ అభివృద్ధితో కూడిన కూటమి (ఇండియా) రాజోలు నియోజకవర్గ సన్నాహక సమావేశం ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు నల్లి శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం రాజోలులో జరిగింది. ఈ నెల 14న రాజోలులో ఇండియా కూటమి, ప్రజా సంఘాలు అంబేద్కర్ యువజన సంఘాలతో సమావేశం నిర్వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో సిపిఐ రాజోలు నియోజకవర్గ కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తోటే ప్రతాప్, దేవాటి సత్యబాబు, పిడిఎం నాయకులు దీపాటి శివప్రసాద్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు నల్లి. చమిందావాస్, చింతా భాస్కరరావు, తాడి వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

సహస్రాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - రాజానగరం : రాజరాజనరేంద్ర పట్టాభిషేక సహస్రాబ్ది, నన్నయ భారత సహస్రాబ్ది కార్యక్రమాలను ఈ నెల 16,17 తేదీలలో తమ వర్సిటీలో నిర్వహిస్తు న్నా మని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు అన్నారు. నన్నయ వర్సిటీ నందు శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో విసి మాట్లాడుతూ కేంద్ర సాహిత్య అకాడమి, నన్నయ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో వెయ్యేళ్ళ చరిత్ర, సంస్కృతి, సాహిత్యానికి సంబంధించి గొప్ప వేడుక సహస్రాబ్ది ఉత్సవాలని ఘనంగా జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. రాజరాజనరేంద్రుడు పరిపాలించిన రాజమహేంద్ర వరంలో, ఆదికవి నన్నయ పేరుతో ఏర్పడిన విశ్వవిద్యాలయంలో ఉత్సవాలు జరగడం విశ్వవిద్యాలయానికి చారిత్రక ఘట్టమన్నారు. విశ్వవిద్యాలయానికి ప్రస్తుతం నాక్ బి ప్లస్ గ్రేడ్ వచ్చిందని, ఎ లేదా ఎ ప్లస్ గ్రేడ్ సాధించే విధంగా కృషి చేస్తామని చెప్పారు. యూనివర్సిటీ అభివృద్ధిలో భాగంగా రూ.16.50 కోట్లతో గార్ల్స్ హాస్టల్ భవన నిర్మాణం, రూ.9.10 కోట్లతో బాయ్స్ హాస్టల్ భవన నిర్మాణాలను చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, విశ్వవిద్యాలయ అధికారులు ఆచార్య కె.శ్రీరమేష్, ఆచార్య వై.శ్రీనివాస రావు, ఆచార్య డి.జ్యోతిర్మయి, డాక్టర్.కె.రమణేశ్వరి, డాక్టర్.పి.విజయ నిర్మల, డాక్టర్.పి.వెంకటేశ్వరరావు, డాక్టర్.ఎన్. ఉదయభాస్కర్, డాక్టర్.కె.సూకరత్నం, ఎస్.లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

విశాలాంధ్ర - ఆలమూరు : గ్రామాల అభివృద్దే ధ్యేయంగా వైసిపి ప్రభుత్వం పనిచేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆలమూరు మండలంలోని పినపళ్ళ గ్రామంలో రూ.36 లక్షల ఓఎన్జీసీ నిధులు, రూ.5 లక్షల మండల పరిషత్ నిధులతో నిర్మించనున్న మయపుంత బిటి రోడ్డు పనులకు శాసనసభ్యులు చిర్ల జగ్గిరెడ్డి కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల సర్వే

విశాలాంధ్ర - కాకినాడ : ఓటర్ల సర్వే కార్యక్రమాన్ని పారదర్శకంగా పూర్తి చేయాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్ నాగ నరసింహా రావు ఆదేశించారు. స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో గురువారం సాయంత్రం బిఎల్‌ఓలతో ఓటర్ల సర్వే పై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈనెల 20వ తేదీ లోపు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. బిఎల్‌వో సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిష నర్ కోన శ్రీనివాస్, తాసిల్దార్ సీతాప తిరావు, డిప్యూటీ సిటీ ప్లానర్ హరిదాస్, ఏసీపీ నాగశాస్త్రులు, బిఎల్వోలు పాల్గొన్నారు.

నోటీసు

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ మరియు సెషన్స్ జడ్జి కాకినాడ

I.A.No.830/22 O.S. 261/1985

FDP 20/2020

కొత్తలంక కామరాజు మరియు ఇతరులు - పిటీషనరు/వాది

మరియు

కొత్తలంక విశ్వనాథం మరియు ఇతరులు - రెస్పాండెంట్స్/ప్రతివాదులు

టు:

27: కొత్తలంక విస్సన్న (తండ్రి) రామచంద్రరావు (లేటు), వయస్సు 60, హిందు, డోర్. నెం.2-115/2, శివాలయం వీధి, జెడ్. రాఘంపేట పోస్టు, జగ్గంపేట, కాకినాడ జిల్లా.

30: అయినవిల్లి వీరరాఘవమ్మ (భర్త) నరసింహమూర్తి, హిందు, వయస్సు 54, డోర్. నెం.2 - 115/2, శివాలయం వీధి, జెడ్. రాఘంపేట పోస్టు, జగ్గంపేట. కాకినాడ జిల్లా.

పై నెంబరు దావాలో 10వ ప్రతివాది కొత్తలంక రామచంద్రరావుకు వారసులుగా చేర్చుటకు పిటీషనరు వాది దాఖలు చేసిన పిటీషను, సదరు కేసులో రెస్పాండెంట్ అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను మీరు ఉద్దేశ్య పూర్వకంగా తీసుకొనకుండా కాలయాపన చేసి యున్నారు. కావున ది. 24-8-2023వ తేదీ పగలు 10 గంటలకు మీరు గాని, మీ వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై మీ వాదన చేసుకొనవలెను. లేని యెడల సదరు విషయమై మీ పరోక్షమున విచారించి తీర్మానం చేయుదురని తెలియజేయడమైనది.

(By Court Order)

అడపా సురేష్,
అడ్వకేట్ ఫర్ పిటీషనర్
కాకినాడ. సెల్: 9154874569

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

భూ హక్కు పట్టాల పంపిణీ

విశాలాంధ్ర-కొవ్వూరు : వైఎస్సార్ జగనన్న భూహక్కు, భూరక్ష కార్యక్రమానికి రాష్ట్రముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి ఎంతో ధైర్యంతో నిర్ణయం తీసుకొని గ్రామ కంఠంలో నివశిస్తున్న అర్హులైన అందరికీ స్వమిత్ర ద్వారా శాశ్వతంగా భూమి పై హక్కును కల్పించేందుకు శ్రీకారం చుట్టి సర్వేలు నిర్వహిస్తూ భూ హక్కు పట్టాలను అందిస్తున్నామని రాష్ట్ర హెూం మంత్రి డాక్టర్ తానేటి వనిత పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక లిటరరీ క్లబ్ లో రెవెన్యూ పంచాయితీ, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వైఎస్సార్ జగనన్న భూహక్కు మరియు భూరక్ష, స్వమిత్ర కార్యక్రమంలో లబ్దిదారులుకు భూహక్కు పట్టాల పంపిణీ కారక్రమంలో హెూం మంత్రి తానేటి వనిత ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ ఇప్పటికే కొవ్వూరు నియోజకవర్గంలో కొన్ని గ్రామాలు సర్వేలు పూర్తయ్యాయని వారందరికీ నేడు 1074 మందికి యాజమాన్యపు ధృవపత్రాలను అందిస్తున్నామన్నారు. కొవ్వూరు నియోజకవర్గ పరిధిలో ఇప్పటి వరకు ఐదు గ్రామాల్లో గ్రామకంఠం సర్వే పూర్తి చేసినట్టు తెలిపారు. జాయింట్ కలెక్టరు ఎన్. తేజ్ భరత్ మాట్లాడుతూ వైఎస్సార్ జగనన్న భూహక్కు మరియు భూరక్ష పథకం భారత దేశంలో ఇప్పటి వరకు ఎక్కడ నిర్వహించలేదన్నారు. ఆంగ్ల పాలకుల పరిపాలన తదుపరి మన ఆంధ్రప్రదేశ్ లోనే ప్రప్రథమంగా జరుగుతోందని పేర్కొన్నారు. అగ్రికల్చర్ సర్వే సాంకేతిక పరమైన డ్రోన్ తో నిర్వహిస్తామన్నారు.

పోర్టిఫైడ్ బియ్యం పంపిణీపై అపోహలువద్దు

విశాలాంధ్ర-కొవ్వూరు :ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేస్తున్న పోర్టిఫైడ్ బియ్యం పోషక విలువలు కలిగి ఉన్నట్లు ఆర్డీవో ఎస్. మల్లిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోర్టిఫైడ్ బియ్యం ను ప్లాస్టిక్ బియ్యం అనే అపోహ పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ అందచేస్తున్న బియ్యం కడిగిన సందర్బంలో పైకి తేలే బియ్యం పోర్టిఫైడ్ బియ్యం మాత్రమే అని తెలిపారు. ఆగస్ట్ మాసం నుంచి పోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఎటువంటి వదంతులు నమ్మవద్దు అని తెలియ చేశారు.

రక్త దాతలు... ప్రాణ దాతలు

విశాలాంధ్ర - అనపర్తి : ప్రాణాపాయ స్థితిలో ఉన్న తోటి ప్రాణిని కాపాడ టంలో రక్తదాతలు ప్రాణదాతలుగా నిలుస్తారని యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ అధికారి టి .రమేష్ కిషోర్ అన్నారు. శుక్రవారం కుతుకులూరులో సంజీవ్ జాజి ఫ్రెండ్ సర్కిల్, వాలీబాల్ గ్యాంగ్ సభ్యులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ముఖ్య అతిథులుగా సర్పంచ్ గొల్లు హేమతులసి, వైస్ ఎంపీపీ పులగం బుల్లిరెడ్డి పాల్గొనగా సుమారు 100 కు పైగా యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సత్తి దొరయ్య రెడ్డి, రామిరెడ్డి మంగయ్యమ్మ చారిటీస్ సెక్రటరీ తేతలి నారాయణరెడ్డి (అనపర్తి), వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి వాటర్ ట్యాంక్ నిర్మాణం అభినందనీయం

విశాలాంధ్ర - గోపాలపురం : ప్రజల దాహార్తిని తీర్చేందుకు సత్యసాయి వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టడం అభినందనీయమని గ్రామ సర్పంచ్ మడిచర్ల ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని గుడ్డిగూడెం గ్రామంలో కనుమూరి పెద్ద సత్యనారా యణ రాజు జ్ఞాపకార్థం వారి కుమారుడు కనుమూరి వెంకటరాజు సత్య సాయి వాటర్ ట్యాంక్ సుమారు 5 లక్షల రూపా యలతో 12 వేల లీటర్ల నీటి సామర్థ్యం గల వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టి ప్రారంభించారు. ఎస్సీ ఏరియాలో మరొక వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టనున్నట్లు కనుమూరి వెంకటరాజు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలోఎంపీటీసీ బోర్రా ఆంజ నేయులు పెనుమత్స రామకృష్ణ రాజు, పంచాయితీ వార్డు సభ్యులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశభక్తిని పెంపొందించేందుకు నా మట్టి - నా దేశం

విశాలాంధ్ర - గోపాలపురం : ప్రజలందరిలో దేశభక్తిని పెంపొందిం చేందుకు నా మట్టి - నా దేశం కార్యక్రమాలను చేపట్టినట్టు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. శుక్రవారం మండలంలోని చిట్యాల గ్రామ సచివాలయం వద్ద ఎంపీడీవో ఆర్. శ్రీదేవి అధ్యక్షతన నా మట్టి నాదేశం త్యాగం చేసిన అమరవీరులను స్మరించు కొంటూ ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ అందరిలో దేశభక్తిని పెంపొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనల మేరకు నా మట్టి - నా దేశం కార్యక్రమాలను చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, కాకులపాటి లలిత శ్రీను, వైకాపా నాయకులు ఎస్కే ఖాదర్ వలీ, కార్యదర్శి సాంబమూర్తి సచివాలయ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

రాష్ట్ర కాంగ్రెస్ కిసాన్ సెల్ ఉపాధ్యక్షునిగా శ్రీహరిబాబు

విశాలాంధ్ర- దేవరపల్లి :ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడిగా దేవరపల్లి మండలం దుద్దుకూరు గ్రామానికి చెందిన కాకర్ల శ్రీ హరి బాబు నియమితులయ్యార. ఈ మేరకు జాతీయ అధ్యక్షుడు సుపాల్ సింగ్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా దుద్దుకూరులో ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశంలో శ్రీహరి బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎదుర్కొంటున్న రైతు సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తామని అన్నారు. ముఖ్యంగా రైతులకు అందవలసిన సబ్సిడీలు సక్రమంగా అందటం లేదని అన్నారు. పోలవరం ప్రాజెక్ట్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రారంభించిందని ఇప్పటివరకు రెండు ప్రభుత్వాలు మారిన పోలవరం ప్రాజెక్టు ఇంకా పూర్తి కాలేదని ఆందోళనవ్యక్తం చేశారు. గౌరీపట్నం దుద్దుకూరు చెరుకుమిల్లి దేవరపల్లి ప్రాంతాలలో తాడిపూడి పంట కాలవ బోదులు మెయింటినెన్స్ సరిగా లేదని అన్నారు. పంట కాలువ బోదులు గండ్లు పడుతున్న ప్రభుత్వం పట్టించుకోవటం లేదని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో దేవరపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రామకృష్ణ పార్టీ సీనియర్ నేతలు చాపల వెంకటేశ్వరరావు గుత్తికొండ సూరిబాబు పాపోలు గంగారావు ఆళ్ల భుజంగరావు కాకర్ల వెంకట్రావు చిటికెన రాజు నున్న శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా తయారీలో పారదర్శకత పాటించాలి

విశాలాంధ్ర - సీతానగరం: ఓటేర్ల జాబితా తయారీలో పారదర్శకత పాటించాలని నియోజక వర్గ ఎన్నికల అధికారి, అర్‌డిఓ చైత్ర వర్షిణి అన్నారు. మండలంలో గల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆర్‌డిఓ చైత్ర వర్షిణి బి ఎల్ ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఓ మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ చేసేటప్పుడు నిబంధనలు పాటించాలని, ఎటువంటి అవకతవకలు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మరణించిన వారిని జాబితా నుండి తొలగించాలని, శాశ్వతంగా వలస వెళ్లిన వారి వద్ద నుండి అనుమతితో మాత్రమే జాబితా నుండి తొలగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సత్యనారాయణ రాజు, ఎంపిడివో కె రమేష్, బి ఎల్ ఓలు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర -కైకలూరు : సమాజం అభివృద్ధి చెందాలంటే మహిళలు అభివృద్ధి చెందాలన్న డా. బి.ఆర్ అంబేద్కర్ మాటలను స్పూర్తిగా తీసుకున్న సీఎం జగన్ మహిళలు అభివృద్ధి చెందితేనే ఈ సమాజం అభివృద్ధి చెందుతుందని మహిళా సాధికారత పెంపొందించే దిశగా పొదుపు సంఘ మహిళలకు శుక్రవారం వైయస్ఆర్ సున్నా వడ్డీ పథకాన్ని వరసగా నాల్గవ విడతగా అందించటం శుభపరిణామమని, రేపటి భవిష్యత్తుకు మీ అందరికి ఒక ఆశాజనకంగా ఉండే రోజుగా మీమీ కుటుంబాలలో మీరందరు చల్లగా ఉంటూ ఆనందపడే విధంగా ప్రభుత్వం పని చేస్తోందని కైకలూరు శాసన సభ్యులు దూలం నాగేశ్వరరావు అన్నారు. కైకలూరులోని వెలుగు కార్యాలయం నందు కైకలూరు నియోజకవర్గంలోని పొదుపు సంఘాల మహిళలకు నాల్గవ విడతగా వైయస్ఆర్ సున్నా వడ్డీ రాయితీ అందించు కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు జయమంగళ వెంకటరమణతో కలసి పాల్గొని అమలాపురంలో జరిగిన వైయస్ఆర్ సున్నా వడ్డీ పథకం అంతర్జాలం ప్రత్యక్ష ప్రసారం వీక్షించినాంతరం ఎమ్మెల్యే డిఎన్ఆర్ మరియు ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ కలసి ఏడు కోట్ల ఇరవై రెండు లక్షల ముప్పై ఒక్క వేల రూపాయల నమూనా చెక్ ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు అడవి వెంకట కృష్ణ మోహన్, చందన ఉమామహేశ్వరరావు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, మండల వ్యవసాయ మార్కెట్ అధ్యక్షురాలు దండే పుష్పలత, వైస్ ఎంపీపీ మహ్మద్ జహీర్, మండల పార్టీ అధ్యక్షులు భట్రాజు శివాజీ, సర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షులు చెరుకువాడ బలరామరాజు, సర్పంచ్ దానం మేరీ నవరత్న కుమారి, దండే రవిప్రకాష్, మారగాని గణపతి, కైకలూరు నియోజకవర్గ ఏపీఎంలు, సీసీలు, వెలుగు కార్యాలయ సిబ్బంది, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి ఇన్వర్టరు బహూకరణ

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : రోటరీ వృద్ధాశ్రమానికి కొయ్యలగూడెం గ్రామానికి చెందిన మానవతా సంస్థ సభ్యుడు నిడదవోలు రామారావు 21 వేల రూపాయల విలువ గల ఇన్వెటర్ను బహుకరించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కరెంటు లేని సమయంలో వృద్ధులు ఆశ్రమంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి ఇబ్బందులను గమనించి ఎంతో సహృదయంతో ఇన్వర్టర్ ను బహూకరించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ చైర్మన్ ఎం. అప్పలరాజు, ఎం.వి అప్పారావు, మద్దు గోపాలకృష్ణ, తోట వెంకటేశ్వరరావు, రోటరీ క్లబ్ అధ్యక్షులు శర్మ, షేక్ బాషా పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

విశాలాంధ్ర- పాలకొల్లు: పాలకొల్లు జోన్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆజాది కా అమృత మహోత్సవ్ ముగింపు ఉత్సవాల్లో భాగంగా ఈనెల 15, స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పాలకొల్లు, పోడూరు, యలమంచిలి మండలాలకు సంబంధించిన సుమారు 35 ప్రైవేట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్స్‌కు చెందిన, ఎంపిక చేసిన సుమారు 600 మంది విద్యార్థులకు శుక్రవారం పాలకొల్లు నాగరాజు పేట గురుకుల విద్యాలయాలలో వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్ విభాగాలలో థర్డ్ క్లాస్ నుంచి టెన్త్ క్లాస్ వరకు చదువుతున్న వారందరికీ ఎలక్యూషన్, ఎస్సే రైటింగ్, డ్రాయింగ్, సాంగ్స్ కాంపిటీషన్స్ నిర్వహించారు. యలమంచిలి ఎం డి ఓ త్రిశూలపాణి, టీచర్స్ పీర్ సాహెబ్, డి వెంకటేశ్వరరావు, ఆర్ ప్రసాదు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. విద్యార్థులను మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాలకు ఎంపిక చేశారు. గెలుపొందిన విద్యార్థులకు పాలకొల్లు మండల విద్యాశాఖ అధికారి గుమ్మళ్ళ వీరాస్వామి బహుమతి ప్రధానోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు జోన్ అపస్మా అధ్యక్షుడు కె.వి.కృష్ణ వర్మ, కార్యదర్శి గొర్ల శ్రీనివాస్, అపస్మ జిల్లా అధ్యక్షుడు పాపారావునాయుడు, మాజీ అధ్యక్షుడు ఆర్ వి అప్పారావు, కరస్పాండెంట్లు ఐవి సుబ్బారావు, వి సాయిబాబా, ఏ.భాను ప్రకాష్, ఏ.శ్రీమన్నారాయణ, జానకిరామ్, శ్రీరామ్, ఆర్. వెంకటేష్, వై వెంకటేష్, ఆర్.కృష్ణంరాజు పి నాయుడు, దుర్గారావు, షాజహాన్ శ్రీనివాస్, పద్మిని తదితరులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్యలో విద్యార్థి ఎన్నికలు

విశాలాంధ్ర-ఏలూరు: స్థానిక శాంతినగర్ పాఠశాలలో విద్యార్థులంతా తమ నాయకులను ఎన్నుకొనే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారని, తద్వారా అత్యధిక ఓట్లు పొందిన విద్యార్థిని విద్యార్థులను అనేక విభాగాలలో నాయకులుగా ప్రకటించే ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ప్రధానోపాధ్యాయురాలు బి.శివకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించే గొప్ప ఆలోచనా విధానాన్ని పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎన్ సి సి ఇన్స్ట్రక్టర్, ఇండియన్ ఆర్మీకి చెందిన హవల్దార్, ఎం. అప్పలరాజు మాట్లాడుతూ దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతిలో ఉన్నదని, వారి సక్రమమైన ఉన్నత చదువులే దేశ ప్రగతికి ఎంతో అవసరమన్నారు. అనంతరం బాల బాలికల విభాగాలలో ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచిన విద్యార్థులకు ప్రత్యేక బ్యాడ్జీలను, ప్రశంసా పత్రాలను అందజేశారు. సభలో జోనల్ ఎకడమిక్ డీన్ జాల సంజీవ్ కుమార్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండండి



విశాలాంధ్ర -కైకలూరు : మత్తుపదార్థాలకు దూరంగా ఉండి పిల్లలను చదివించి గొప్పవాకిగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రుల పైనే ఉందని డాన్ బోస్కో నవజీవన్ బాలభవన్ కైక లూరు కోఆర్డినేటర్ టి.లీలావతి, సామాజికవేత్త ఎల్. ఎస్.భాస్కరరావు, టి.అప్పారావు పేర్కొన్నారు. డాన్ బోస్కో నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో ఏలూ రుజిల్లా నియోజకవర్గ కేంద్రమైన కైకలూరు ఎస్టి (యానాదుల) కాలనీలో గురు.శుక్రవారంనాడు పిల్లలను చదివించటం, పిల్లలదుర్వి నియోగం,గృహ హింస,మత్తు పదార్థాల దుర్వినియోగం,ప్రభుత్వపథకా లు కలిగిఉండటం వంటి విషయాలపై సమాచారం అందించి నైపుణ్యాలు పెంపొందించే కార్యక్రమం నిర్వహిం చారు. ఈసందర్భంగా లీలావతి, భాస్కరరావు, అప్పా రావు మాట్లాడుతూ, పారిశుధ్య పనులలోను, ప్లాస్టిక్ పదార్థాలను సేకరించి అమ్మటం, తదితర పన్నుల్లో సంవత్సరం పొడవునా కష్టపడి సంపాదించిన సొమ్ము ను,మత్తుపదార్థాలకు చాలామంది బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండి మీ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆరోగ్యమే మహాబలం అని వివరించారు. ఈ కార్యక్ర మంలో ఎస్టి కాలనీవా సులు అమ్మా జీ, పోలమ్మ, నాగ మణి, రాజు,యేసు తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-ముదినేపల్లి : ప్రస్తుతం కండ్లకలక విజృంభిస్తున్న తరుణంలో ముందస్తుగా మందులు అందుబాటులో ఉన్నాయా అని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ వైద్యాధికారిణిని ప్రశ్నించారు. మండల సర్వసభ్య సమావేశంలో పలు శాఖలతో రివ్యూ నిర్వహించారు. ముదినేపల్లి హోమియో వైద్యాధికారిణి హేమలత మాట్లాడుతూ మందులు ముందస్తుగా పాఠశాలలకు , కళాశాలలకు , గ్రామాల్లో పంపిణీ చేసేంత స్థాయిలో మందులులేవన్నారు. ఎవరైనా ఆసుపత్రికి వస్తే మందులు అన్ని రోగాలకు ఇవ్వడం జరుగుతుందన్నారు. వర్షాకాలంలో గ్రామాల్లో త్రాగునీరు , పారిశుద్యంపై కార్యదర్శులు , సర్పంచులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన విధులతో పనులు వేగవంతం చేయాలన్నారు. ఉపాధి హామీ పథకానికి సంబంధించిన పనుల బిల్లులు చెల్లింపులు జరుగుతున్నాయని ఏపీఎంఓ రాజు వివరించారు.డ్రైన్లు స్తంభించడం , కాలువల్లో నీరు ప్రవాహం తగ్గడంపై రైతుల సమస్యలు సభ్యులు అధికారులు దృష్టికి తెచ్చారు. ఎంపీడీవో పి మల్లేశ్వరి , తాహసిల్దార్ కె శ్రీనివాస్ , రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఘంటా సంధ్య , వైస్ ఎంపీపీ రాచూరి రాధ , ఎంపీటీసీలు , సర్పంచులు , వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బయో మెడికల్ వ్యర్థాలు పర్యావరణానికి ప్రమాదకరం

జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర-భీమవరం: బయో-మెడికల్ వ్యర్థాలు మానవులకు, పర్యావరణానికి ప్రమాద కరం, వీటి నిర్వీర్యంపై అందరూ విస్తృత అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు.శుక్రవారం స్థానిక విష్ణు కాలేజ్ ఆడిటోరియంలో బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై సుస్థిర అభివృద్ధి సూచికల జిల్లా స్థాయి కమిటీ సమీక్షా సమావేశం, వర్క్‌షాప్ కు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మానవ కార్యకలాపాలన్నీ వ్యర్థాలను ఉత్పత్తి చేస్తాయని, అటువంటి వాటిలో కొన్ని వ్యర్థాలు ప్రమాదకరమైనవన్నారు. వాటిని సరైన విధానంలో నిర్వీర్యం చేయడం ఎంతో ముఖ్యమన్నారు. పారిశ్రామిక వ్యర్థాలు, మురుగు నీరు, వ్యవసాయ, మెడికల్, తదితర వ్యర్థాలు నీరు, నేల, గాలిని కలుషితం చేస్తాయన్నారు. బయో మెడికల్ వ్యర్థాలలో కణజాలాలు, అవయవాలు, శరీర భాగాలు వంటి మానవ శరీర నిర్మాణ వ్యర్థాలు, వెటర్నరీ హాస్పిటల్స్ నుండి పరిశోధన సమయంలో ఉత్పత్తి చేయబడిన జంతు వ్యర్థాలు మైక్రోబయాలజీ, బయోటెక్నాలజీ వ్యర్థాలు, హైపోడెర్మిక్ సూదులు, సిరంజిలు, స్కాల్పెల్స్, విరిగిన గాజు వంటి వ్యర్థ పదార్థాలు, విస్మరించిన మందులు, సైటో టాక్సిక్ మందులు డ్రస్సింగ్, బ్యాండేజీలు, ప్లాస్టర్ కాస్ట్‌లు, రక్తంతో కలుషితమైన పదార్థం, ట్యూబ్‌లు, కాథెటర్‌లు వంటి మురికి వ్యర్థాలు, ఏదైనా సోకిన ప్రాంతాల నుండి ద్రవ వ్యర్థాలు, భస్మీకరణ బూడిద, ఇతర రసాయన వ్యర్థాలు ఉంటాయన్నారు. సాధారణ జీవ-వైద్య వ్యర్థాలను శుద్ధి చేసే సదుపాయం అందుబాటులో లేని గ్రామీణ లేదా మారుమూల ప్రాంతాల్లో మాత్రమే లోతైన ఖననం ద్వారా పారవేయడం అనుమ తించ బడుతుందన్నారు. తొలుత బయో-మెడికల్ వ్యర్థాలు పై అవగాహన గోడ ప్రతిని జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏయస్పి ఏవి సుబ్బరాజు, పొల్యూషన్ కంట్రోలు బోర్డు ఇ ఇ కె.వెంకటేశ్వర రావు, జిల్లా పరిషత్ సీఈవో కెవియస్ఆర్ రవి కుమార్, సిపివో కె.శ్రీనివాసరావు, జిల్లా పరిశ్రమ శాఖ అధికారి వి.ఆదిశేషు, జిల్లా ఆర్డబ్ల్యూఎస్ అధికారి ఏ.రామ స్వామి, డిఎంహెచ్ డి.మహేశ్వరరావు, పురపాలక సంఘం కమిషనర్లు యం శ్యామల, కె టి సుధాకర్, తాడేపల్లిగూడెం ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. పి సూర్యనారాయణ, హెల్త్ సూపర్వైజర్లు, హెడ్ నర్సులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనలో పోటీపడాలి

- జాయింట్ కలెక్టర్ ఎస్. రామ్ సుందర్ రెడ్డి

విశాలాంధ్ర-భీమవరం: లక్ష్యాలు సాధించుటలో మండల అధికారులు పోటీపడి పని చేసి మంచి ఫలితాలు సాధించాలని జిల్లా జాయింటు కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డి అన్నారు.శుక్రవారం జిల్లా కలెక్టరేటు స్పందన సమావేశ మందిరంలో రీ సర్వే , అసైన్డ్ భూములు, సివిల్ సప్లై, కలెక్షన్స్, అడంగల్, సర్వే, ఇండ్ల స్థలాలు, భూసేకరణ, టూరిజం ప్రాజెక్టులు, స్పందన, మీసేవ ,వాటరు టాక్స్ తదితర అంశాలు పై ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు తో జిల్లా జాయింటు కలెక్టరు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మండలాల వారీగా అంశాల ప్రగతిని సమీక్షిస్తూ, ప్రగతిలో వెనుకబడి ఉన్న మండలాల అధికారులపై జిల్లా జాయింటు కలెక్టరు అసహనం వ్యక్తం చేసారు. వారం రోజుల్లో ప్రగతిని చూపాలని జిల్లా జాయింటు కలెక్టరు ఆదేశించారు. మండల స్థాయిలో స్పందన కార్యక్రమం అత్యంత బాధ్యతతో ప్రతి ఫిర్యాదుకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకొని ఈనెల 21వ తేదీ లోగా నూటికి నూరుశాతం పూర్తి చెయ్యాలని జిల్లా జాయింటు కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డి అన్నారు.ఈ సమావేశంలో ఆర్డీవో దాసిరాజు, జిల్లా సివిల్ సప్లై అధికారి యన్. సరోజ, జిల్లా సర్వే అధికారి కె. జాషువా, తహశీల్దార్లు, ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్లు,మండల సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన యువతీ యువకులకు ఉద్యోగావకాశాలు

విశాలాంధ్ర-బుట్టాయిగూడెం: జిల్లా ఉపాధి కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ, సెట్ వెల్, ఏలూరు వారి సంయుక్త ఆధ్వర్యములో ఈనెల 14వ తేదీ ఉదయం గం.9లకుకు ఐ.టి.డి.ఎ కే.ఆర్.పురం నందు గల వై.టి.సి. నందు జాబ్ మేళా నిర్వహించబడునని జిల్లా ఉపాధి కల్పనాధికారి సి. మధుభుషనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఇంటర్వ్యూలు నిర్వహించుటకు తిరుపతి జిల్లా లో శ్రీసిటిలో గల కాడ్బెరి చాకొలేట్ తయారి కంపెనీ ప్రతినిధులు హాజరుకానున్నారని, ఈ కంపెనీ లో టీం మెంబెర్ గా పనిచేయుటకు ఇంటర్ పాస్ , 18 నుండి 20 సంవత్సరలు వయసు కలిగిన ఉత్సాహవంతులు అయిన యువతీ యువకులు పాల్గొనడానికి అర్హులన్నారు. ఉద్యోగములో సెలెక్ట్ అయిన వారికి ఉన్నత చదువులకు కూడా అవకాశం ఇవ్వబడుతుందన్నారు.యువతకు ప్రభుత్వము కల్పిస్తున్న ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరముల కొరకు 9150015264, 9666322032 నెంబర్లను సంప్రదించ వలసినదిగా జి. ప్రవీన్ కృష్ణ, నేషనల్ కెరీర్ సర్వీసు జిల్లా కోఆర్డినేటర్ తెలిపారు.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన జడ్పీ చైర్మన్

విశాలాంధ్ర-నల్లజర్ల: నల్లజర్ల మండలం పోతవరం జడ్పీ ఉన్నత పాఠ శాలను ఉమ్మడి పశ్చిమ గోదావరి జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం, విద్యార్థులు మౌలిక వసతులు, తరగతి గదులు, మరుగుదొడ్లు గురుంచి నేరుగా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల అటెండెన్స్ రిజిస్టర్, నాడు నేడు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ పాఠశాలలో అధనపు తరగతి గదుల నిర్మాణం కోసం రూ.2 లక్షలు జిల్లా పరిషత్ నిధులు నుంచి విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. పాఠశాలలో క్రీడా ప్రాంగణం వర్షం నీటికి మునిగిపోతుందని విద్యార్థులు చెప్పగా స్కూల్ గ్రౌండ్ సమస్యకు తగు పరిష్కారం చేస్తానన్నారు. విద్యార్థులు అందరూ బాగా చదివి తల్లి ంద్రులకు ఉపాధ్యాయలకు మీ స్కూల్ కి సమాజానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో నల్లజర్ల జడ్పీటీసీ ముప్పిడి లక్ష్మి, గ్రామ సర్పంచ్ నూతుకుర్తి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ డైరెక్టర్‌గా శ్రీనివాస్ రెడ్డి ప్రమాణ స్వీకారం



విశాలాంధ్ర - జీలుగుమిల్లి : పోలవరం మార్కెట్ కమిటీ డైరెక్టర్గా బోధ శ్రీనివాసరెడ్డి శుక్రవారం కొయ్యల గూడెంలో ప్రమాణ స్వీకారం చేశారు. పిరాజువరం నుండి ద్విచక్ర వాహనాలు, కార్లతో ర్యాలీగా జీలుగుమిల్లి నుండి రౌతు గూడెం మీదుగా కొయ్యలగూడెం భారీ ర్యాలీతో నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. జీలుగుమిల్లి మండలం నుండి మరో డైరెక్టర్‌గా దాకారపు సాయి లక్ష్మి కూడా ప్రమాణ స్వీకారం చేశారు. బోధ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మార్కెట్ కమిటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఏఎంసీ డైరెక్టర్గా నన్ను నియమించిన పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోర్సు పోచమ్మ, చందా ప్రసాద్, వనమా రామకృష్ణ, సున్నం సురేష్ కక్కిరాల రాము శ్యామల సుబ్బారెడ్డి తమ్మ మురళీధర్ రెడ్డి సూరిశెట్టి ఏసుబాబు తదితర నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఇంటింటా మహిళా శక్తి

విశాలాంధ్ర - ముమ్మిడివరం : తెలుగుదేశం పార్టీ మినీ మహానాడుమేనిఫెస్టోలో ప్రకటించిన మహాశక్తి మహిళలకు ఎంతో చేయూత ఇస్తుందని ఆర్థికంగా ఆ కుటుంబం స్థిరపడుతుందని రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ముమ్మిడివరం మండలం క్రివానిరేవు, మర్లపాలెం, బూరుగుపేట గ్రామంలో ముమ్మిడివరం మండల టిడిపి అధ్యక్షులు అర్థాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మహాశక్తి చైతన్య రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గం లోనూ ప్రతి గ్రామంలో ఉన్న మహిళల దగ్గరికి వెళ్లి తెలుగుదేశం పార్టీ మహాశక్తి పథకాలు గురించి తెలియజేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దాట్ల పృథ్వీరాజ్, ముమ్మిడివరంమాజీ మార్కెటింగ్ చైర్మన్ గొల్లకోటి దొరబాబు, ముమ్మిడివరం మండల మహిళా అధ్యక్షురాలు మట్ట సుభాషిని రాహుల్, దొమ్మేటి రమణ కుమార్, తాడి నరసింహారావు, పొన్నమండ రామలక్ష్మి, దాసరి జగదీశ్వరి, మెండి కమల, టేకుమూడి అనంతలక్ష్మి, కొండేటి వెంకటలక్ష్మి, సాకా సీతాదేవి, కుడిపూడి మల్లేశ్వరి, చిక్కాల అంజిబాబు, తదితరులు పాల్గొన్నారు.

నూతన అధ్యక్షుడు బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర - సీతానగరం: రఘుదేవపురం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘ నూతన అధ్యక్షుడుగా నిడదవోలు శ్రీనివాసు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసు మాట్లాడుతూ రైతులకు ఏ అవసరం వచ్చినా ఎల్లపుడూ అండగా ఉంటూ సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా గారికి ధన్యవాదాలు తెలిపారు. రైతులు కూడా సొసైటీ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ రామకృష్ణ, సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తుకు గ్యారంటీ ఇంటింటా ప్రచారం

విశాలాంధ్ర - అనపర్తి : టిడిపి మినీ మేనిఫెస్టో భవిష్యత్తుకు గ్యారంటీ లో భాగంగా టిడిపి మహిళా నేతలు "మహాశక్తి" ప్రచార కార్యక్రమాన్ని నియోజకవర్గ కేంద్రం అనపర్తిలో గోవిందరెడ్డి పేట, బాబా నగర్, శేషయ్యమ్మ నగర్ అంజిరెడ్డి నగర్, షారోన్ పురంలో నిర్వహించారు. టిడిపి మహిళా నేతలు ఇంటింటికి వెళ్లి మినీ మేనిఫెస్టో భవిష్యత్తుకు గ్యారంటీ సూపర్ సిక్స్ తో మహిళలకు కలిగే లబ్ధిని వివరించి రాబోయే ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు మహిళా అధికార ప్రతినిధి వేణమ్మ, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సూర్యకుమారి, జిల్లా తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు కర్రి శేషారత్నం, మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు గౌతమి, సుభాషిని, సత్య గౌరి, మల్లీశ్వరి, త్రివేణి, సర్పంచ్ నాగవేణి కుమారి (ఆరికరేవుల) తదితరులు పాల్గొన్నారు.

చదువుకున్న పాఠశాలకు పోడియం బహూకరణ

విశాలాంధ్ర - గోకవరం : చిన్ననాటి స్నేహితులతో కలిసి చదువుకున్న పాఠశాలకు ఏదైనా చేయాలి అన్న ఉద్దేశంతో అందర్నీ తీర్చిదిద్దిన పాఠశాలకు పోడియంను బహూకరించారు శివ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు.ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ 1989 -1990లో స్నేహితులతో కలిసి పదవ తరగతి చదువుకున్నామని, 30 సంవత్సరాల తర్వాత అందరూ కలిసి గెట్ టుగెదర్ పాఠశాలలో నిర్వహించినట్టు తెలిపారు చదివిన పాఠశాలకు ఏదైనా మంచి చెయ్యాలి అన్న ఉద్దేశంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పోడియం బహూకరించామని తెలిపారు. శివ వెల్ఫేర్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈసందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు పిఎస్ రెడ్డి మాట్లాడుతూ మంచి సంకల్పంతో గ్రామంలో అందిస్తున్న సేవలు అభినందనీయమని తెలిపారు. శివ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సుమారు 150 మంది సభ్యులతో కూడిన బృందం ఈ సహాయ సహకారాలు అందిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వాకచర్ల రవి, మారిశెట్టి నాగేశ్వరరావు, పచ్చిపులుసు, రాఘవేంద్రరావు. మహిపాలా సతీష్, బత్తుల రాయుడు, నాగులకొండ వీరభద్రం, అద్దంకి వెంకటేశ్వరరావు, రామోజీ, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్యోద్యమ లక్ష్య సాధనకోసం మెరుగైన విద్యనభ్యసించాలి

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం స్వాతంత్ర్యోద్యమ లక్ష్య సాధన కోసం విద్యార్థులంతా మెరుగైన విద్యను అభ్యసించాలని అంగరలోని శ్రీసిద్ధార్థ కళాశాలల చైర్మన్ వాకా దివ్య శేఖర్ అన్నారు. స్థానిక కళాశాల ఆవరణలో శుక్రవారం 77వ భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు 77వ ఆకృతిలో నిలుచుని దేశభక్తిని చాటుకున్నారు. మువ్వన్నెల జెండా చేతబట్టి భారతదేశ ఔన్నత్యాన్ని కాపాడుతామంటూ నినాదాలు చేశారు. భారతదేశం అన్ని రంగాల్లో ప్రతిభ కనబర్చాలంటూ శ్రీసిద్ధార్థ కళాశాల కరస్పాండెంట్ వాకా రాజా ఆకాంక్షించారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణ త్యాగాలు చేసిన మహనీయులను నిత్యం స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో కళా శాల ప్రిన్సిపాల్ పి రమణ, అధ్యాపక సిబ్బంది, జూనియర్, సీనియర్ ఇంటర్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీవీ విభాగంలో టీకేఎం రూమియన్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-రాజమండ్రి: ఎం పీ వీ సెగ్మెంట్లోకి తాము నూతనంగా విడుదల చేసిన విడుదల చేసిన రూమియన్ నిలుస్తుందని టీ కే ఎం ప్రాంతీయ ప్రతినిధి తెలిపారు. టొయోటా కిర్లోస్కర్ మోటార్ రూమియన్ ఆవిష్కరణ సభలో ఆయన మాట్లాడుతూ పూర్తి సరికొత్త టొయోటా రూమియన్ విభిన్నమైన వినియోగదారు ప్రాధాన్యతలు అనుగుణంగా పెట్రోల్ వేరియంట్‌కు 20.51 కిమీ/లీటర్, దాని సీ ఎన్ జీ వేరియంట్‌కు 26.11 కిమీ/కేజీ అద్భుతమైన ఇంధన సామర్థ్యాన్ని నిర్ధారిస్తుందన్నారు . మాన్యువల్ ఆటోమేటిక్ ఔత్సాహికులిరువురికీ అందుబాటులో ఉందని, పూర్తి సరికొత్త టయోటా రూమియన్ 5-స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ మృదువైన 6-స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ ఎంపికతో సౌకర్యవంతమైన డ్రైవింగ్ అనుభవాన్ని అందిస్తుందన్నారు. దీని స్టైలిష్, ప్రీమియం బాహ్య డిజైన్, విశాలమైన సౌకర్యవంతమైన ఇంటీరియర్‌లతో, పూర్తి సరికొత్త టయోటా రూమియన్ కుటుంబ ప్రయాణ అవసరాలకు అనువైన ఎంపికగా నిలుస్తుందన్నారు. పూర్తి సరికొత్త టొయోటా రూమియన్ టయోటా ఐ-కనెక్ట్, స్మార్ట్‌ఫోన్ స్మార్ట్‌వాచ్ కనెక్టివిటీ, వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటోతో కూడిన అధునాతన 17.78 సెం.మీ స్మార్ట్‌ప్లే కాస్ట్ టచ్‌స్క్రీన్ ఆడియో, యాపిల్ కార్ ప్లే ఆర్కామిస్ సరౌండ్ సెన్స్ వంటి టెక్ ఫీచర్‌లను అందిస్తోందన్నారు. పూర్తి సరికొత్త టొయోటా రూమియన్ దాని ప్రపంచ-స్థాయి భద్రతా పరికరాలు, సరిపోల్చలేని రీతిలో అమ్మకం తరువాత సేవలు మ ఇబ్బంది లేని యాజమాన్య అనుభవాన్ని అందించే 3 సంవత్సరాలు/1,00,000 కిమీల ప్రామాణిక వారంటీతో వస్తుందని చెప్పారు.

మాక్స్ ఫ్యాషన్స్ స్టోర్స్ లో ఫ్రీడమ్ షాపింగ్ ఫెస్టివల్ సందడి

విశాలాంధ్ర-రాజమండ్రి : మాక్స్ ఫ్యాషన్స్ ఫ్రీడం ఫెస్టివల్ ను ప్రారంభించింది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫ్రీడమ్ షాపింగ్ ఫెస్టివల్ సందర్భంగా మరెక్కడా లేని విధంగా ఫ్యాషన్ ప్రియుల కోసం అద్భుతమైన ఆఫర్ లను అందిస్తుంది. ఆగస్ట్ 11 నుండి ఆగస్ట్ 15 వరకు ఈ ఫెస్టివల్ అన్ని మ్యాక్స్ షోరూమ్స్ లో అందుబాటులో ఉంటుంది.ఇందులో భాగంగా ఎంపిక శ్రేణి పై 1 కొంటె 1 ఉచితంగా పొందే ఆఫర్ ను అందుబాటులోకి తీసుకువచ్చింది. రాయితీ ఆఫర్‌లతో మీ వార్డ్‌రోబ్‌ను అప్‌గ్రేడ్ చేయడంలో థ్రిల్‌ను అనుభవించాలని కోరుతోంది.

మినీ జాబ్ మేళాలో 33 మంది అర్హత

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : రాష్ట్రనైపుణ్యాభివృద్ధి సంస్థ అధ్వర్యంలో నిర్వహించిన మినీ జాబ్ మేళా లో 33 మందిని ఆయా సంస్థలు ఎంపిక చేసుకొని ఉద్యోగ అవకాశాలను కల్పించినట్టు జిల్లా నైపుణ్యాధికారి ఎం. కొండలరావు తెలిపారు. శుక్రవారం నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించుటకు గాను చేపడుతున్న "జాబ్ మేళా" లో భాగంగా జిల్లాలోని బొమ్మూరు నందు గల న్యాక్‌లో "మినీ జాబ్ మేళ" నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకులకు జాబ్ మేళాల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ మినీ జాబ్ మేళా లో 3 కంపెనీలు పాల్గొన్నాయని 67 మంది నిరుద్యోగ యువత పాల్గొనగా 33 మందిని ఆయా కంపెనీలు ఎంపిక చేసి ఉద్యోగావకాశాలు కల్పించాయన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ (నాక్) జున్నూరి రాజు, ప్లేసిమెంట్ ఎగ్జిక్యూటివ్ రాజ్ కుమార్ ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

18న సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : కొత్తపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈనెల 18వ తేదీన సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపీడీవో అబ్రహం లింకన్ శుక్రవారం తెలిపారు. 18వ తేదీన నిర్వహించు సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులు హాజరుకావాలని లేని పక్షంలో వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమానికి ఎంపీటీసీలు సర్పంచులు హాజరుకావాలని కోరారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

విశాలాంధ్ర - ఆలమూరు : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ఆలమూరు మండలంలోని గుమ్మిలేరు గ్రామ సర్పంచ్ గుణ్ణం రాంబాబు వ్యాఖ్యానించారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణీల్లో రక్తహీనత లోపం తలెత్తకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోషకాహార కిట్లను అందిస్తున్నాయని వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. శుక్రవారం గుమ్మిలేరులో పౌష్టికాహార కిట్లను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ పద్మావతి, అంగన్వాడి, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర జిల్లా గ్రంథాలయ సంస్థ ఫించనుదారుల సంఘం ప్రధాన కార్యదర్శిగా సలాది సాయి సత్యనారాయణ

విశాలాంధ్ర - కాకినాడ : విశాఖపట్నంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జిల్లా గ్రంథాలయ సంస్థల పెన్షనర్స్ అసోసియేషన్ ద్వితీయ రాష్ట్ర మహాసభ కార్యక్రమంలో రాష్ట్ర జిల్లా గ్రంథాలయ సంస్థల పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా కాకినాడకు చెందిన సలాది సాయి సత్యనారాయణను ఎన్నుకోవడం జరిగింది. కార్యవర్గ సభ్యునిగా రాజమహేంద్రవరం నకు చెందిన వి లక్ష్మయ్యను ఎన్నుకోవడం జరిగింది. సలాది సాయి సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర జిల్లా గ్రంథాలయ సంస్థల పెన్షన్ దారుల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ ఎన్నిక పట్ల ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థల పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం సంజయ్‌శ్రీ, అధ్యక్షుడు గట్టి రామారావు, లైబ్రేరియన్లు ములంపాక శ్రీనివాసరావు, రేపాక వెంకటరాము, జిల్లా పెన్షనర్స్ హర్షం వ్యక్తం చేశారు.

అవయవ దానం మరొకరికి ప్రాణదానం

విశాలాంధ్ర - కరప : అవయవ దానం మరొకరికి ప్రాణదానం అని ప్రముఖ వైద్యులు డాక్టర్ బొండా వెంకన్నా రావు పేర్కొన్నారు. జన రక్ష స్వచ్ఛంద సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో 13వ తారీకున ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సును వేలంగి గవర్నమెంట్ జూనియర్ కళాశాల ఆవరణంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కళాశాల వైస్ ప్రిన్సిపల్ అప్పలరాజు, వేలంగి పంచాయతీ ప్రథమ పౌరుడు సవిలే నీలిమ రాజేష్, ఓల్డ్ స్టూడెంట్ అసోసియేషన్ అధ్యక్షులు సాక శ్రీనివాస్, కాకినాడ అవయవదాన సంస్థ అధ్యక్షులు వితరణశీలి బాదం బాలకృష్ణ, దాదాపు 200 మంది జూనియర్ కళాశాల విద్యార్థిని విద్యార్థులు గ్రామస్తులు పెద్దలు పాల్గొన్నారు. సభ అనంతరం కొందరు విద్యార్థిని విద్యార్థులు అవయవదానం చేయడానికి అంగీకారం తెలిపారు.

పెంపుడు కుక్కకు సంతాప సభ, విందు

విశాలాంధ్ర-పోడూరు: మండలంలోని పెనుమదంలో సిద్ధాంతి ముద్దాల రాంబాబు ఇంట్లో గత 15 సంవత్సరాలుగా ఎంతో అపురూపంగా పెంచిన కుక్క సాయి వారం రోజుల క్రితం కన్నుమూసింది. కుటుంబ సభ్యులందరితో ఎంతో అనుబంధం పెనవేసుకున్న సాయి మరణం ఆ కుటుంబం వారితో పాటు ఇరుగు పొరుగు వారిని కలిచివేచింది. ఈ సందర్భంగా కుక్క సాయి సంస్మరణకు గురువారం ఇంటి ఆవరణలో సంతాప సభ ఏర్పాటు చేశారు. కుక్క సాయి చిత్రపటానికి ప్రైవేట్ టీచర్ ముద్దాల పద్మ పూలమాల వేసి నివాళులు అర్పించారు. సభలో పాల్గొన్న స్థానికులు, విద్యార్థులు సాయి ఆత్మ శాంతికి మూడు నిమిషాలు మౌనం పాటించారు.ఈ సందర్భంగా ముద్దాల రాంబాబు మాట్లాడుతూ గత 15 సంవత్సరాలనుండి కుక్క సాయితో తమ కుటుంభం సభ్యులకున్న అనుబంధాన్ని తమ పట్ల కుక్క సాయి చూపిన విశ్వాసాన్ని వివరించారు.

ఈ పంట నమోదు తప్పనిసరి

విశాలాంధ్ర - శంఖవరం : ప్రతి రైతు మీరు పండించిన పంటలను సర్వే నెంబర్లతో సహా ఈ పంట ఈ యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని ఉద్యానవన శాఖ సహాయకులు శ్యాంసుందర్ తెలిపారు. శుక్రవారం శంఖవరం మండలం మండపం పొలాలలో రైతులు వేసిన పంటలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా రైతులతో శ్యామ్ మాట్లాడారు వరి, చెరుకు, అరటి, మిరప, ప్రత్తి,కంది, వంగ, టమాటా తదితర పంటలను సర్వే నెంబర్లతో సహా నమోదు చేయించుకున్నట్లయితే బీమా, బ్యాంకు రుణాలు ప్రకృతి వైపరీత్యాల వలన పంటలు నష్టపోతే నష్టపరిహారం రాయితీ యంత్ర పరికరాలు, ఎరువులు, పురుగుమందులు అన్ని రైతులకు సులభంగా వర్తిస్తాయన్నారు. ఈ అవకాశాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు నక్కా మాణిక్యాలు, నక్కా నాగేశ్వరరావు ఉన్నారు.